క్లుప్తంగా

అంబేడ్కర్ జీవితంపై ప్రతిభా పోటీలు



సత్యవాడలో ప్రతిభా పోటీల్లో విజేతలు

కె.గంగవరం: సత్యవాడ గ్రామంలో బుధవారం డా.బీఆర్ అంబేడ్కర్ జీవితంపై విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన, ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం సత్యారామ్, జైభీమ్ యూత్ నాయకులు శ్యామ్, సంతోష్, పండు, వెంకట్, రాజు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



సత్యవాడలో ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న భక్తులు

కె.గంగవరం: సత్యవాడలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. రూ.60 లక్షల అంచనాతో ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించనున్నారు. ఆలయంతో పాటు 45 అడుగుల స్వామి భారీ విగ్రహాన్ని నిర్మించనున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి, తోట పృథ్వీరాజ్, పల్లి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెలగాలమ్మ జాతర

కపిలేశ్వరపురం: మండలంలోని టేకి గ్రామ దేవత వెలగాలమ్మ జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణలతో జాతర విశేషంగా సాగింది. సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామానికి చెందిన ఆడపడుచులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకొన్నారు. అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. నేడు ఆలయం వద్ద తీర్థం నిర్వహించనున్నట్టు ఉత్సవ నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

19న మండల సమావేశం

రాయవరం: స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో ఈ నెల 19న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎన్.కీర్తిస్పందన బుధవారం తెలిపారు. ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశంలో వివిధ శాఖల ప్రగతిపై సమీక్ష నిర్వహిస్తారన్నారు. అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని సూచించారు.

ఘనంగా వీరేశలింగం జయంతి



వీరేశలింగం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థినులు

మండపేట: ద్వారపూడి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం సంఘ సంస్కర్త కందు కూరి వీరేశలింగం జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం విజయ జ్యోతి ఆధ్వర్యంలో వీరేశలింగం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీరేశలింగం జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. బాల్య వివాహాల నిర్మూలకు ఆయన ఎంతో కృషి చేశారన్నారు. పురుషులతో పాటు మహిళలు కూడా విద్యలో రాణించేందుకు పాటుపడ్డారని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కంకటాల మురళీకృష్ణ, ఉపాధ్యాయురాలు రామలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



సభలో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీమోహన్

మలికిపురం: ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్, డీఎస్పీ మురళీమోహన్ సూచించారు. మండలంలోని లక్కవరంలో జరిగిన సదస్సులో ఇరువురూ పాల్గొని ప్రసంగించారు. గంజాయి నిర్మూలన, శక్తి యాప్‌లపై సభలో పాల్గొన్ని మహిళలు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆడపిల్లలను, మహిళలను గౌరవించేలా పిల్లలను పెంచాలని సూచించారు. అక్రమాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సీఐ నగేష్‌కుమార్, ఎస్సై సురేష్, గుబ్బల శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కోరంగి కాలువకు మోక్షం లేదా..!

- 32 వేల ఎకరాల్లో సాగునీటి ఇక్కట్లు
- బీటలు వారుతున్న శివారు భూములు



టి.మామిడాడ వద్ద కుచించుకుపోయి తూడు, గుర్రపుడెక్కతో మూసుకుపోయిన కోరంగి కాలువ

రామచంద్రపురం: డెల్టా ప్రాంతంలోని రైతులకు సాగునీటి ఇబ్బందులు ఏటా ప్రహసనంగా మారుతున్నాయి. ఎగువ నుంచి సాగునీరు విడుదల అంతంత మాత్రంగా ఉండడానికి తోడు డెల్టాలోని పంటకాలువల్లో తూడు, గుర్రపుడెక్క పెరిగిపోవడం, పూడికలు పెరిగిపోవడంతో పొలాలకు సాగునీరు అందక రైతులు గగ్గోలు పెడుతున్నారు. గత కొంత కాలంగా పంట కాలువలు ఆధునీకరణ పనులకు నోచుకోకపోవడంతో ప్రస్తుత నీటిఎద్దడి తరుణంలో కాలువ శివారు భూముల్లో ఉన్న పంటపొలాలకు చుక్కనీరు అందక ఎండిపోయి బీటలు వారుతున్నాయి. నియోజకవర్గ పరిధిలో వెల్లలాకుల నుంచి చేదువాడ వరకు కోరంగి కాలువ కుచించుకుపోయింది. ఇరువైపులా మేటలు వేసి పిచ్చి మొక్కలు, తూడు, గుర్రపుడెక్క పెరిగిపోయి ఉన్నాయి. ఫలితంగా 15 మీటర్ల వెడల్పున ఉండాల్సి కాలువ సన్నగా మారి 8 మీటర్లకు తగ్గిపోయింది. కోరంగి కాలువ కింద నియోజకవర్గ పరిధిలోని కాజులూరు, కె.గంగవరం, రామచంద్రపురం మండల గ్రామాలతో పాటు కరప, తాళ్లరేవు మండలాల్లో సుమారు 32 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. కాలువ కుచించుకుపోవడంతో ఈ భూములకు తరచూ సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుత నీటి ఎద్దడి కారణంగా ఇబ్బంది మరింత ఎక్కువగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోరంగి కాలువ వెల్లలాకుల నుంచి మంజేరు వరకు ప్రవహించి అక్కడ రెండు భాగాలుగా విడిపోయి ఒక భాగం మంజేరు శివార్లలో కోరంగి డ్రెయిన్‌లోకి మరో భాగం శలపాక, తణుకువాడల మీదుగా ప్రవహించి తుల్యభాగ డ్రెయిన్‌లోకి కలుస్తుంది. ఈ కాలువకు అనుసంధానంగా ఇరువైపులా 100 పిల్లకాలువలు ఉన్నాయి. 2009 మే నెలలో అప్పటి ప్రభుత్వం ఈ కాలువను ఆధునీకరించారు. అప్పటిలో దాదాపు రూ.30 లక్షలు వెచ్చించి కోరంగి కాలువలో పొక్లెయిన్‌తో పూడికలు తొలగించి వెడల్పు చేశారు. అయితే ఆ విధంగా తీసిన మట్టిని కాంట్రాక్టరు కాలువ గట్లపైనే వేయడంతో కొద్ది రోజుల తరువాత ఆ మట్టి కరిగిపోయి మరలా కాలువలోకే చేరింది. దీంతో కాలువ పరిస్థితి మరలా మొదటికే వచ్చింది. అప్పటి నుంచి నేటి వరకు ఈ కాలువ ఆధునీకరణ పనులకు నోచుకోలేదు. ప్రస్తుతం కాలువలకు ఇరువైపులా మట్టిమేటలు వేసింది. దీంతో కాలువ సగభాగం మూసుకుపోయింది. ఉన్న కాలువలో తూడు, గుర్రపుడెక్క పెరిగి పోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. దీనివల్ల ఆయకట్టు భూములకు సక్రమంగా నీరు అందడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మండల గ్రామాల్లోన్ని వరి పొలాలు పాలు పోసుకునే దశలో కొన్ని ఈనిక దశలో కొన్ని ఉన్నాయి. ఈ దశలో సాగునీటి ఇబ్బందులు కారణంగా దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కోరంగి కెనాల్‌కు సాగునీటి ప్రవాహాన్ని పెంచడంతో పాటు ఆధునీకీకరణ పనులకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. యుద్ధప్రాతిపదికన తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టాలని ప్రస్తుత వేసవిలో పూడికలు తొలగించాలని రైతులు కోరుతున్నారు. అధికారులు కాలువలను పట్టించుకోకుంటే భవిష్యత్‌లో మొత్తం మూసుకుపోయి పొలాలు నీరు అందక బీడువారే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కాలువను ఆధునీకరించాలని కోరుతున్నారు.

కెనాల్‌ను అభివృద్ధి చేయాలి



కోరంగి కెనాల్ గత 20 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. మొత్తం కాలువ పూడుకుపోవడం మూలంగా శివారు ప్రాంత రైతులు వరి పంట పొలాలకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కోరంగి కెనాల్‌ను అభివృద్ధి చేయాలి

– పడాల వీవీ సత్యనారాయణరెడ్డి, రైతు, బంధనపూడి

సాగునీటికి తీవ్ర ఇబ్బందులు



గత కొంత కాలంగా శివారు ప్రాంత రైతులు సాగునీటి కొరతను ఎదుర్కొంటున్నారు. కోరంగి కెనాల్ పూర్తి స్థాయిలో మూసుకుపోవడంతో నీటి ఎద్దడి ఏర్పడుతుంది. కెనాల్‌ను పూర్తిగా ఆధునీకరించాల్సిన అవసరం ఉంది.

– కేసన వీర్రాజు, రైతు, అంద్రంగి

ధనమ్మ తీర్థానికి ముమ్మరంగా ఏర్పాట్లు

- రెండు నియోజకవర్గాల సరిహద్దులో ఉమ్మడి జాతర
- భారీ సంఖ్యలో తరలిరానున్న భక్తజనం
- బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన కాకినాడ రూరల్ సీఐ



తీర్థ మహోత్సవాలకు సిద్ధమౌతున్న ధనమ్మతల్లి ఆలయాలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ తదితరులు

కాజులూరు: కాకినాడ, కోటిపల్లి రహదారిలో కాజులూరు మండలం గొల్లపాలెం, కరప మండలం కొంగోడు గ్రామాల సరిహద్దులో వెలసిన శ్రీధనమహాలక్ష్మి (ధనమ్మ) అమ్మవారి తీర్థ మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ యాజమాన్యం, నిర్వాహక కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. రెండు నియోజకవర్గాల సరిహద్దులో ఉమ్మడి గ్రామదేవత అయిన ధనమ్మతల్లి అమ్మవారికి ఏటా జాతర అంగరంగ వైభవంగా జరుగుతుంటాయి. రెండు గ్రామాల సరిహద్దులో వెలసిన అమ్మవారికి ఆ నాడు భక్తులు రెండు ఆలయాలను నిర్మించగా కాలక్రమేపీ అది రెండు మండలాల సరిహద్దు నుంచి రెండు నియోజకవర్గాల సరిహద్దుగా మారింది. అయినప్పటికీ నేటికీ ఇరు గ్రామాల పెద్దలు సఖ్యతతో ఒకే రోజు ఇక్కడ అమ్మవారికి తీర్థమహోత్సవాలు నిర్వహిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం రెండు గ్రామాల సరిహద్దుల్లో ధనమహాలక్ష్మి (ధనమ్మ) అమ్మవారికి రెండు ఆలయాలు నెలకొల్పబడ్డాయి. నాటి నుంచి ఈ రెండు గ్రామాల ప్రజలు ధనమ్మ అమ్మవారిని గ్రామ దేవతగా కొలుస్తూ పూజలు చేస్తున్నారు. కాకినాడ, కోటిపల్లి రహదారిలో వెళ్లు ప్రతీ భక్తుడు ఈ ఆలయాల వద్ద ఆగి అమ్మవారిని దర్శించుకుని దక్షణ చెల్లించి వెళుతుంటారు. ఏటా ఉగాది అనంతరం వచ్చే పౌర్ణమి తర్వాత గురువారం అమ్మవారికి తీర్థమహోత్సవాలు నిర్వహిస్తుంటారు. కాకినాడ, రామచంద్రపురం, మండపేట, యానం, కోటిపల్లి, అమలాపురం పరిసర ప్రాంతాల నుంచి సుమారు 50 వేల మంది భక్తులు తీర్థ మహోత్సవాలకు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటుంటారు. ఇందులో భాగంగా అమ్మవారి ఆలయ ప్రాంగణమంతా పాక, పందిళ్లు వేసి విద్యుత్ దీపాలతో, భారీ కటౌట్లతో సుందరంగా అలంకరిస్తున్నారు. బుధవారం రాత్రి రెండు గ్రామాల్లోనూ జాతర నిర్వహిస్తున్న భక్తులు గురువారం వేకువజాము నుంచి ఆలయాల వద్ద తీర్థం జరుపుతారు. జాతర మహోత్సవాల్లో భాగంగా రెండు గ్రామాల్లోనూ అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగిస్తారు. గరగ నృత్యాలు, కోయసంబరాలు, గారడీ, పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో తెల్లవారే వరకూ గ్రామాల్లో సందడి కొనసాగుతుంది. గురువారం తెల్లవారుజాము నుంచి భక్తుల తాకిడితో కరప మండలం గౌర్రిపూడి నుంచి కాజులూరు మండలం ఆర్యావటం వరకూ రహదారి కిటకిటలాడుతుంది. కార్యక్రమాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాటు చేసినట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ధనమ్మతల్లి తీర్థమహోత్సవాల్లో బందోబస్తు ఏర్పాట్లపై బుధవారం కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ధనమ్మతల్లి ఆలయాలు కాకినాడ, కోటిపల్లి రహదారిపై ఉండటంతో రాకపోకలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించినట్టు తెలిపారు. వాహనాలను గొల్లపాలెం పంచాయతీ వెనుక రహదారి నుంచి కొంగోడు మీదుగా వెంకటేశ్వరస్వామి ముఖద్వారం వరకూ మళ్లిస్తున్నామన్నారు. తీర్థమహోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కరప, గొల్లపాలెం, కోరంగి, ఇంద్రపాలెం, పోలీస్‌స్టేషన్లతో పాటు కాకినాడ నుంచి 200 మంది పోలీసు బలగాలను రప్పిస్తున్నామన్నారు. గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్, కరప ఎస్సై సునీత తదితరులు ఏర్పాట్లను పరిశీలించిన వారిలో ఉన్నారు.

అపరాల సాగుకు రైతులు ప్రాధాన్యమివ్వాలి

కాజులూరు: మండల గ్రామాల్లో అపరాల సాగుకు రైతులు ప్రాధాన్యమివ్వాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. బుధవారం శలపాకలో వీఏఏ ఎస్.అనూష ఆధ్వర్యంలో జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో డెల్టాలో రైతులు తొలకరి, దాళ్వా పంటల అనంతరం మూడో పంటగా పెసర, మినుము వంటి అపరాలు, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట ఎరువులు సాగు చేసేవారన్నారు. క్రమేపీ పంటల సాగులో ఏర్పడ్డ కాలమార్పుల కారణంగా దాళ్వా సాగు ఆలస్యమై రైతులు అపరాల సాగు మానివేశారన్నారు. అయితే వరితో పాటు అదనపు ఆదాయాలను తెచ్చే అపరాల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం జనుము, పిల్లిపెసర, పెసర, మినుము వంటి అపరాల విత్తనాలను 50 శాతం రాయితీపై సరఫరా చేస్తుందన్నారు. మినుము విత్తనాలు నాలుగు కేజీల మార్కెట్ ధర 560 ఉండగా సబ్సిడీపై రూ.280, పెసర విత్తనాలు నాలుగు కేజీల మార్కెట్ ధర 520 ఉండగా సబ్సిడీపై రూ.260కి అందజేస్తున్నామన్నారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీఏఏ వనుం రమ్య పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రాయవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. ఎంపీసీ గ్రూపు నుంచి ఎం.అమృతవర్షిణి 967 మార్కులు సాధించి జిల్లాలో రెండో స్థానంలో నిలిచినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. బైపీసీ నుంచి ఎం.నందిని, సీఈసీ నుంచి కె.చండీప్రియ, హెచ్ఈసీ నుంచి పి.వెన్నెల ప్రథమస్థానంలో నిలవడంతో వారిని ప్రిన్సిపాల్, సిబ్బంది దుశ్శాలువాలతో సత్కరించారు. అలాగే ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి ప్రత్యేక బహుమతులు, ప్రథమ సంవత్సరంలో నాలుగు గ్రూపుల నుంచి ప్రథమ స్థానం, ద్వితీయస్థానంలో నిలిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్, అధ్యాపకులు ప్రత్యేక బహుమతులు అందించి సత్కరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను గ్రామ పెద్దలు ఉండవిల్లి రాంబాబు, ఇతర ప్రముఖులు అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామచంద్రపురం రూరల్: ఈ నెల 14 న ద్రాక్షారామ పీవీఆర్ హైస్కూల్ సమీపాన ఎదురెదురుగా మోటారు సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో గాయపడిన పెద్దింశెట్టి కేశవకుమార్ (36) కాకినాడ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. కేశవకుమార్ కె.గంగవరం మండలం గంగవరం గ్రామానికి చెందిన వ్యక్తి. అదే మండలంలోని అముజూరులో హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ నిర్వహిస్తున్నాడు.

ఇద్దరు పిల్లలతో వివాహిత అదృశ్యం

రామచంద్రపురం రూరల్: మండలంలోని అన్నాయిపేటకు చెందిన వివాహిత దొంకని రాణి తన ఇద్దరు పిల్లలతో కనిపించకుండా పోయిందని భర్త సతీష్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ బుధవారం విలేకరులకు తెలిపారు. కుటుంబంలో మనస్పర్ధల కారణంగా మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయిందని భర్త ఫిర్యాదు చేశాడన్నారు.

వైఎస్సార్ సీపీ మండల, పట్టణ కమిటీల నియామకం

రామచంద్రపురం: నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కమిటీలను ఏర్పాటు చేస్తూ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో నియామక ఉత్తర్వులను జారీ చేశారు. నూతనంగా నియమితులైన మండల, పట్టణ కమిటీ సభ్యులను పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్‌లు అభినందనలు తెలియజేశారు.

రామచంద్రపురం పట్టణ కమిటీ

ఉపాధ్యక్షులుగా గుమ్మళ్ల రత్నం, గుబ్బల గణ, ప్రధాన కార్యదర్శులుగా పోతంశెట్టి గోపాలకృష్ణ, కొయ్యా బంగారు బాబు, సత్తిశంకర్‌రెడ్డి, పిల్లి భీమేశ్వరరావు, కార్యదర్శులుగా సూరంపూడి రాంబాబు, మల్లిడి సాయిలక్ష్మి, గుంటముక్కల దొరబాబు, దార్ల శ్రీనివాసరావు, ఉండవిల్లి రాజు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా గుణ్ణం సూరిబాబు, గుణ్ణం వెంకటేశ్వరరావు, బొమ్ము మోహనరావు, మూలపర్తి ప్రభాకరరావు, వెన్నేటి సుందరరామ్‌కుమార్, యనమదల సుబ్రహ్మణ్యం, ఇనకోటి రాజేష్, శలగల మధు, చోడే భానుభాస్కరరావు, గుత్తుల శ్రీనివాసు, కొనసా ప్రసాద్, కోటి కనక దుర్గారావు, జుత్తుగ గులాంబాషా, తోట సూరిబాబు, నాగిరెడ్డి మురళీకృష్ణ, నేతల చంటిబాబు, పెంటపాటి శ్రీనివాసరావు, సానబోయిన రాంబాబు, వాడపల్లి రామదుర్గాప్రసాద్, ర్యాలీ సత్యనారాయణ, యనమదల ఆదినారాయణ, వారా శ్రీను, గాడి సత్తిరామకృష్ణ, దంగేటి నారాయణరావు, బొక్కా సత్యనారాయణ, దంగేటి శివ, పాటి ప్రసాద్, వేల్పూరిరాంబాబు, పెంకే సుబ్రహ్మణ్యం, దంగేటి సూరిబాబు, చేగొండి త్రిమూర్తులు, కురుపూడి భీమన్న నియమితులయ్యారు.

కె.గంగవరం మండల కమిటీ:

ఉపాధ్యక్షులుగా వైట్ల అచ్యుతరామయ్య, నరాల శ్రీనివాసు, ప్రధాన కార్యదర్శులుగా అల్లంపల్లి సూరిబాబు, చిట్టూరి శ్రీనివాస్, పిల్లి శ్రీనివాసరావు, సాదా వెంగళరావు, కార్యదర్శులుగా పెమ్మాడి మల్లేశ్వరరావు, అడపా నారాయణ స్వామి, చిట్టూరి భద్రం, చల్లా పరమేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా అనుసూరి సాయిబాబు, దుడల నాగేశ్వరరావు, మేడిశెట్టి శ్రీనివాసు, కోట సత్యనారాయణ, కాకర్లపూడి పద్మనాభరాజు, జిల్లెళ్ల బాల సుబ్రహ్మణ్యం, కట్టా తిరుమలరావు, బొక్కా భానుమూర్తి, మేడిశెట్టి శ్రీను, వాళిలినేని సాయి రఘురామ్, కదా వెంకటరమణ, పెద్దిరెడ్డి ఏసు ప్రకాశ్, కోటి వెంకటరమణ, తాడాల సోమశేఖర్, వాసంశెట్టి కృష్ణ, మేడిశెట్టి సుబ్రహ్మణ్యం, చెల్లె నాగేశ్వరరావు, వల్లు సుబ్బారావు, చిట్టూరి శ్రీనివాస్, పంపన సుబ్బారవు, కురుపూడి చంద్రరావు, నీలం సత్యకృష్ణ, చీకట్ల గోపాలం, పిల్లి పార్వతీశం, తిరుకోటి రాజశేఖర్, కుప్పల నాగన్న, వల్లభరెడ్డి చిన్ని, గిడ్డి బాలకృష్ణ, వెంపల్లి సతీష్‌కుమార్(నాని), పిల్లి రాంబాబు, కోట వీవీ సత్యనారాయణ మూర్తి, పెందుర్తి గనిబాబులను నియమించారు.

కాజులూరు మండల కమిటీ

ఉపాధ్యక్షులుగా గుంటూరి అప్పారావు, పెద్దిరెడ్డి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శులుగా కేవసనకుర్తి వీరబాబు, యాళ్ల సత్తిబాబు, మాత నూకారావు, వనుం సుబ్బారావు కార్యదర్శులుగా మాతా మురళీ, అనాల సీత, చొల్లంగి బాల సూర్యప్రకాశ్, దంగేటి వెంకన్న, నెల్లి బ్రహ్మాజీ, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పితాని సుబ్రహ్మణ్యం, పోలినాటి సూర్యచంద్రరావు, గంజా సూరిబాబు, తాడి వీరవెంకట వాసురెడ్డి, మాదిరెడ్డి పృథ్వీరాజ్, నిమ్మాతి విజయ్, కంచి ఏసునాదం, నరాల ఈశ్వరరావు, మోకన ధనరాజు, కాదాగణేష్, రేకాడి ఫణీంద్ర, పిల్లి నాగరాజు, రాయుడు నాగరాజు, పాలిక భూషణం, మేడిశెట్టి వీరబాబు, పంపన శ్రీను, బీరా సతీష్, టేకుమూడి శంకరరావు, దొమ్మేటి కొండ, కడియా వెంకటరమణ, పెంకే వెంకటరమణ, సువారి గోవిందు, నరాల సుబ్బరాజు, పెంకే సత్యనారాయణలను నియమించారు.

సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడంపై హర్షం

మండపేట: వక్ఫ్ చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో వైఎస్సార్ సీపీ పిటిషన్ దాఖలు చేయటం హర్షణీయమని ఆ పార్టీ మైనారిటీ సెల్ టౌన్ కన్వీనర్ షేక్ గౌస్ మొహిద్దీన్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు చట్టాన్ని మైనారిటీలకు వ్యతిరేకంగా రూపొందించిదన్నారు. వైఎస్సార్ సీపీ ముస్లింల శ్రేయస్సును కాంక్షిస్తూ వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయటం సబబేనన్నారు. మాజీ సీఎం జగన్ ముస్లింలకు అండగా నిలిచారన్నారు. కూటమి నాయకులు వక్ఫ్ చట్టం ఆమోదానికి మద్దతివ్వడం బాధాకరమన్నారు. వైఎస్సార్ సీపీకి అధికారం లేనప్పటికీ ముస్లిం సమాజానికి అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

చిన్నారులకు టీకాలు



ఆలమూరులో చిన్నారులకు టీకాలు అందజేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.మల్లికార్జున్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలు అందజేశారు. వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి వైద్యసేవలను పర్యవేక్షించారు. పెదపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముదులంక, మడికి, గుమ్మిలేరు, నర్సిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలకు, గర్భిణులకు ఇంజక్షన్లు అందజేశారు. ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు టీటీ, డీపీటీ, మీజిల్స్, పెంటావాలెంట్, ఎంఆర్, హైపటైటిస్ బీ వ్యాక్సిన్లను అందజేశారు. బాలింతలకు, గర్భిణులకు బలవర్థక ఔషధాలను, యాంటీ బయాటిక్ మందులను అందజేశారు. హెల్త్, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే కుష్ఠు నివారణ సాధ్యం

కొత్తపేట: కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని అడిషనల్ డీఎం అండ్‌హెచ్ఓ భరతలక్ష్మి తెలిపారు. డీఎంఅండ్‌హెచ్ఓ దుర్గారావుదొర సూచనల మేరకు మండలంలోని వానపల్లి పీహెచ్‌సీలో భరతలక్ష్మి ఆధ్వర్యంలో కొత్తపేట డివిజన్లోని వైద్యాధికారులకు, నోడల్ పర్సన్లకు కుష్ఠు వ్యాధిపై ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి ఎలా వస్తుంది.. ఎలా రాదు అనే అంశాలపై జిల్లా డిప్యూటీ ఆఫీసర్ మాధవరపు వెంకటేశ్వర్లు వివరించారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వాలు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలను డివిజనల్ నోడల్ ఆఫీసర్ సూర్యారావు వివరించారు.

వల్లూరు చెరువుగట్టుపై ఇళ్ల తొలగింపు



తమకు సమయం ఇవ్వాలని పోలీసులను కోరుతున్న వల్లూరు పెద్ద చెరువుగట్టు నివాసితులు



వల్లూరు చెరువుగట్టుపై ఇళ్లను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం: మండలంలోని వల్లూరులో పెద్ద చెరువుగట్టుపై ఉన్న నివాసాలను (ఆక్రమణలు) బుధవారం ఎంపీడీఓ కె.రత్నకుమారి పర్యవేక్షణలోని అధికారులు, సిబ్బంది తొలగించారు. చెరువుల పరిరక్షణలో భాగంగా ఆక్రమణలను తొలగించామని ఎంపీడీఓ రత్నకుమారి తెలిపారు. దీర్ఘకాలంగా గ్రామంలోని నిరుపేద, మధ్యతరగతి ప్రజలు చెరువుగట్టుపై తాటాకు, రేకులతో నివాసాలను ఏర్పాటు చేసుకొన్నారు. ఉన్నట్టుండి బుధవారం పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలోని సిబ్బంది జేసీబీ సాయంతో నివాసాలను కూల్చివేశారు. తమకు కాస్త సమయం ఇవ్వాలని నివాసితులు కోరినప్పటికీ అధికారులు ససేమిరా అంటూ తొలగించారు. దీనిపై ఎంపీడీఓ కె.రత్నకుమారి మాట్లాడుతూ చెరువులను పరిరక్షించాలంటూ సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సుమారు ఐదేళ్లుగా ఆక్రమణదారులకు ఇళ్లను స్వచ్ఛందంగా తొలగించుకోమని నోటీసులు ఇస్తూ వచ్చామన్నారు. చివరగా 3 నెలలు క్రితం నోటీసులు ఇచ్చామన్నారు. అయినప్పటికీ స్పందన లేకపోవడంతో పోలీసులు, జేసీబీ సాయంతో నివాసాలను తొలగించామన్నారు. ఆక్రమణలో ఉండటంతో 20 ఇళ్లను తొలగించామని, 9 కుటుంబాలవారు ప్రత్యామ్నాయం లేని నిరుపేదలు కావడంతో వారికి మరికొంత సమయాన్ని ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ మోహన్, ఆర్ఐ అర్జమ్మ, ఎస్సై రవికుమార్, గ్రామ కార్యదర్శి సత్తిబాబు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.